International Journal of Academic Research
P-ISSN: 2348-7666: Impact Factor: 6.023
Homepage: https://www.ijar.org.in/
Volume-12, Issue-4, Oct-Dec-2025
This work is licensed under a Creative Commons Attribution 4.0 International License [CC BY 4.0]

**Research Article**

# తార్కిక రచనల పునాది తాతాజీ

**శ్రీ ఉండా దుర్గారావు**
తెలుగు లెక్చరర్
ప్రభుత్వ జూనియర్ కళాశాల చాగల్లు

ఒకనాటి సాయంత్రం భార్యతో కలిసి కోవెలకు వెళ్ళినప్పుడు అక్కడ చూసిన దేవుని విగ్రహం, దేవాలయంపై చూసిన బూతు బొమ్మలు, దేవాలయం బయట అడుక్కునేవాళ్లు, వీటిని తలుచుకుంటూ భార్యను చూస్తూ నాలో కొన్ని ప్రశ్నలు తలెత్తాయి. 1. పెళ్లి దాన్ని పుట్టుపూర్వోత్తరాలు ఏమిటి? 2. దేవాలయం పై బూతు బొమ్మలు ఎందుకు? 3. పనిచేసే ప్రతి వాళ్ళు సంఘాలుగా ఏర్పడి ఎన్నో సభలు సమావేశాలు ఏర్పాటు చేసుకుంటారు కదా అలాగే ఈ అడుక్కు తినే వాళ్ళు కూడా ఒక మహాసభ ఏర్పాటు చేసుకుంటే వాళ్ళు అసలు ఏం మాట్లాడుకుంటారో అని మనలాంటి వాళ్లకు కలిగే ఇలాంటి ఎన్నో ప్రశ్నలకు తార్కికంగా తన రచనలతో సమాధానం చెప్పిన అభ్యుదయవాది, అందరూ తాతాజీ అని పిలిచే శ్రీ తాపీ ధర్మారావు గారు సాహిత్యం ద్వారా సమాజంతో సంభాషణ చేయాలని బలంగా నమ్మారు.

**పెళ్లి దాని పుట్టుపూర్వోత్తరాలు:**

పెళ్లి అన్న భావన ఎలా ప్రారంభమైంది? ఇప్పటి పెళ్లిలోని ఆచారాలు మొదట ఎలా ప్రారంభమైంది అని తెలియచేసే రచన ఇది. పెళ్లికి కారణాలు – 1. జత కట్టడానికి 2. సంతానం కోసం 3. సంతాన రక్షణ కోసం 4. మనసులు కలవడం లేదా ప్రేమ అనుకుంటారు.

మొదట మానవుడు కూడా అన్ని జంతువుల లాగా ఆకలి, నిద్రతో పాటు జత కట్టడం కూడా ఉండేది. పెళ్లి దానిని కొంత నిరోధిస్తుంది. సంతానం కనడం అనేది ఆడవారికి ప్రకృతి పరంగా వచ్చిందనుకునేవారు అప్పట్లో. మన ప్రాచీన గ్రంథాల్లో కూడా అలాగే ఉంది. సంతాన సంరక్షణ బాధ్యత తల్లిది దానికి పురుషుడితో సంబంధం లేదు. ప్రేమ అనేది కొంతకాలం మాత్రమే ఉంటుంది కాబట్టి ఈ కారణాలు ఏవి సహేతుకంగా లేవు అన్నారు తాతాజీ.

నిప్పు, చక్రం కనిపెట్టి వ్యవసాయం పశుపోషణ ప్రారంభమైన సమయంలో తనకి పని సాయం చేయడానికి మరో మనిషి సాయం కావాల్సి వచ్చింది. ఇదే పెళ్లికి ప్రాతిపదిక. తెగలుగా ఏర్పడి జీవించే రోజుల్లో మొదటగా కట్టుబాట్లు ప్రారంభమయ్యాయి. పెళ్లి మొదట విచ్చలవిడిగా ఉండేది. తర్వాత కొన్ని నిషేధాలు ప్రారంభమయ్యాయి.

1. తల్లి పిల్లని నిషేధం
2. ఒక తల్లికి పుట్టిన పిల్లల్లోని నిషేధం,

3. అన్నదమ్ముల పిల్లల వివాహం 40
4. మేనరికలు తర్వాత రక్తసంబంధం ఉన్నవారితో నిషేధం. ఇవి ఇప్పటి సగోత్రీకుల వివాహ నిషేధం గా మారింది.

**కన్యాశుల్కం:**

ఒక తెగలో  వివాహాలు నిషేధించడంతో మరొక తెగవారిని వివాహం చేసుకోవాల్సి వచ్చినప్పుడు తన ఇంట్లో పని, పొలం పని చేసే అమ్మాయిని ఎవరు ఊరికిసే ఇవ్వరు కాబట్టి పెళ్ళికొడుకు ఆ అమ్మాయి తండ్రికి ఆవులను, మేకలను ఇలా విలువైనవి ఇచ్చి తెచ్చుకునేవారు ఇలా మొదలైంది కన్యాశుల్కం.

**తాళీ, గాజులు ఎందుకు?:**

ఒక తెగవారు ఇంకొక తెగవారిపై యుద్ధం చేసి విజయం సాధించినప్పుడు ఆ తెగలోనే ఆడవాళ్లకు చేతులకు, కాళ్లకు, మెడకు సంకెళ్లు వేసి ఉంచేవారు. ఆ అమ్మాయిని నేను గెలిచి తెచ్చా అని చెప్పడం దీని ఉద్దేశం. రాను రానూ... దాడులు చేయడం అనేది పోయిన ఈ ఆచారం మాత్రం మెడలో సన్నని తాడు, చేతులకు గాజులు, కాళ్లకు కడియాలుగా మారి బానిసత్వపు అవశేషాలు అలంకరణ అయ్యాయి.

**బాల్య వివాహాలు ఎలా మొదలయ్యాయి:**

మొదట్లో ఎవరైనా పెళ్లి కాకుండా మరణిస్తే వారు నరకానికి వెళ్తారని భావించేవారు. అందుకు అప్పటికే మరణించిన వ్యక్తితో ఈ మరణించిన వ్యక్తికి పెళ్లి చేసేవారు. దానిని నివారించడానికి తర్వాత బాల్య వివాహాలు ఏర్పరిచారు.

**దేవాలయంపై  బూతుబొమ్మలు ఎందుకు?:**

దేవాలయం మీద బూతుబొమ్మలు ఎందుకు? అనే ప్రశ్న మన పెద్దలను అడిగితే దేవుని దర్శించుకునే సమయంలో మన మనసు ఎంత నిగ్రహంగా ఉండగలదో పరీక్షించడానికి అంటారు. కానీ, ఇది అసలు కారణం కాదనిపించి దాదాపు 15 సంవత్సరాలు పరిశోధన చేసి రాసిన పుస్తకం “దేవాలయం మీద బూతు బొమ్మలు ఎందుకు”?.

**ఒకప్పటి నమ్మకం:**

భూములో విత్తునాటితే మొక్కలు మొలకెత్తుతాయి. దానికి సూర్యుడు శక్తిని ఇస్తాడు. ఇక్కడ భూమి స్త్రీ అయింది. సూర్యుడు పురుషుడైనాడు. ఈ నియమాల మీదే పంచభూతాలకు స్త్రీత్వ, పురుషత్వాలు ఆపాదించాడు మానవుడు. ఏ పంటైనా ఉత్పత్తి సమయం కొంతకాలం వరకే, ఒకసారి ఉత్పత్తి అయ్యాక మళ్ళీ కావాలంటే కొంత సమయం పడుతుంది. స్త్రీ కూడా అలాగే కాన్పు తర్వాత బలహీన పడుతుంది. దీనిని బట్టి చూస్తే భగవంతుడు శక్తి కోల్పోతాడు, ఆ శక్తిని తిరిగి దేవుడికి ఇవ్వడానికి ఈ కార్యాలు నిర్వహించేవారు. ఈ కార్యాలు ఎంత ఎక్కువగా జరిగితే ఎంత ఎక్కువ మంది పాల్గొంటే అంత శక్తి వస్తుంది. అందుకే దేవాలయాలు ఒకప్పటి శోభనపు గదులు అన్నారు. దేవదాసులు ఈ కార్యాల ద్వారా గడించిన సొమ్మును కూడా దేవాలయాలకు వినియోగించేవారు. ప్రతి స్త్రీ

పురుషుడు కూడా ఈ కార్యాల్లో పాల్గొనేవారు. దీని వెనకాల ఉంది భక్తి భావం మాత్రమే. త్రికాలల్లో చేసే సంధ్యావందనం కూడా ఉదయం, సాయంకాలంలో సూర్యునికి శక్తిని పెంచడానికే .

కొందరు పరమభక్తులు నపుంసకులుగా మారి దేవాలయాల్లో పూర్తి సమయం గడిపేవారు. వీరే అర్చకులుగా ఉండేవారు. వీరికి దేశ దేశాల్లో పంటూ, పంతు, పండ అనే పేర్లు ఉండేవి. వీటి అర్థం నపుంసకులు, ఇదే తర్వాత అర్ధ సామ్యత్వంపొంది పూజనీయులు, గురువులు అనే అర్థంలో పండితులైనారు. అయితే నిఘంటువుల్లో అసలు అర్థం మార్చి జ్ఞానము ఉన్నవాడు అని అర్థాన్ని పరిమితం చేశారు. అందుకే పూజారి వస్త్రధారణ చీరను పోలి ఉంటుంది.

**ఆలిండియా అడుక్కు తినే వాళ్ళ మహాసభ:**

ఇది హాస్య రచన కాదు. అపహాస్యమైన మానవ సంఘజీవనానికి అర్థంలాంటి రచన. అడుక్కునేవాడు అల్పుడు, దానం చేసేవాడు ఉదాత్తుడు, అనే భావన మనలో సహజంగానే పాతుకుపోయింది. కానీ ఇవ్వటం కంటే అడగడం ఇంకా కష్టం. నోరు తెరిచి అడగడానికి అంతరాత్మను ఎంతగా చంపుకోవాలో, ఆ...అడిగేవాడికే తెలుసు. అలాంటిది ముష్టి వాళ్ళు తమ జీవితాంతం అలా యాచిస్తున్నారంటే వారి స్థితి చెప్పడం చాలా కష్టం. ఈ యాచనా అనేది ఎలా ప్రారంభమైందంటే మనిషి నాగరికత నేర్వకముందు వేట ద్వారా ఆహారం సేకరించినప్పుడు దానిని అంతా సమానంగా పంచుకుని తినేవారు. సేకరించిన మనిషికి కీర్తి లభించిన ఆహారం మాత్రం అందరిదీను. ఇది ఇలాగే కొనసాగి ఉంటే ఇప్పుడు మనం చూస్తున్న ఉన్నవాడు, లేనివాడు అనే భేదం లేకపోయేది. ఒకడు అక్రమంగా సంపాదించి ఇదంతా నాదే అంటే వాడిని చూసి తక్కిన వారు అదే బాట పట్టారు. ఈ పెనుగులాటలో బలవంతుడు పెద్దవాడైనాడు, మెత్తని వాడు లేనివాడు అయినాడు దీనికి వేదాంతలు, పూర్వజన్మ సుకృతం అనే కర్మ సిద్ధాంతమని వల్లించారు. పూర్వజన్మ కర్మ వల్ల ఈ జన్మలో ఇలాంటి బ్రతుకు బ్రతికే వాడికి పూర్వజన్మ జ్ఞానం లేదు. తన తప్పు ఇది అని తెలియక అదే తప్పు మళ్ళీ మళ్ళీ చేసి మళ్ళీ మళ్ళీ అదే శిక్ష అనుభవించడం ఎంత వరకు సమ్మతం. పోనీ... ఈ శిక్ష వేసినా దేవుడేనే ఇదేమి న్యాయం అని అడుగుదామంటే ఆయనే ఎదుర్పడడు. ఎదురు పడకపోబట్టే భగవంతుడు బ్రతికిపోయాడు. లేకపోతే ఈ ప్రశ్నలకు బదులు చెప్పలేక ఆయన తన అధికారాలని చాలించుకునే వాడేమో, పెద్దపెద్ద దేశాలలో ఒకప్పుడు ఉన్న బిక్షగాడు నేడు కనిపించడం లేదు అంటే ఈ కర్మ సిద్ధాంతం ఆ దేశాలకు వర్తించదా అన్నారు తాతాజీ. ఒక కుటుంబంలో కుంటివాడు, గుడ్డివాడు పుడితే వాడి పోషణ కుటుంబం చూసుకుంటుంది. అదే ధర్మంగా భావిస్తారు. అలాగే తోటి మానవుడు అడుక్కుంటున్నాడు అంటే సంఘం అప్రయోజకత. “ధర్మం చేయండి బాబు అని ముష్టివాడు అడిగి అడిగితే దాని అర్థం తనకు డబ్బు ఇవ్వమని కాదు “ధర్మంచర” అని వేదాలు ఘోషిస్తున్న మీరు ధర్మానికి పరిత్యజించారు అని చేస్తున్న ధర్మబోధ అని అన్నారు తాతాజీ

**ఆధార గ్రంధాలు:**

1. పెళ్లి దాని పుట్టుపూర్వోత్తరాలు
2. దేవాలయంపై బూతుబొమ్మలు ఎందుకు

**3. ఆలిండియా అడుక్కు తినే వాళ్ళ మహాసభ**

**Citation:** శ్రీ ఉండా దుర్గారావు 2025. "తార్కిక రచనల పునాది తాతాజీ". International Journal of Academic Research, 12(4): 91-94.
**Copyright:** ©2025 శ్రీ ఉండా దుర్గారావు. This is an open-access article distributed under the terms of the Creative Commons Attribution License (https://creativecommons.org/licenses/by/4.0/), which permits unrestricted use, distribution, and reproduction in any medium, provided the original author and source are credited.